క్లుప్తంగా

మండల కమిటీలు రద్దు



ములుగు: ఏఐసీసీ, టీపీసీసీ సూచనల మేరకు మండల కమిటీలను రద్దుచేసి మండల ఇన్‌చార్జ్‌లను నియమించినట్లు ఏఐసీసీ మహిళా ప్రధాన కార్యదర్శి, ములుగు ఎమ్మెల్యే డాక్టర్ ధనసరి సీతక్క అన్నారు. జిల్లాకేంద్రంలో ఏర్పాటు చేసిన సమావేశంలో సీతక్క మండల ఇన్‌చార్జ్‌లను ప్రకటించారు. ములుగు గొల్లపల్లి రాజేందర్‌గౌడ్, వెంకటాపురం(ఎం) బైరెడ్డి భగవాన్‌రెడ్డి, గోవిందరావుపేట దాసరి సుధాకర్, ఎస్ఎస్ తాడ్వాయి బొల్లు దేవేందర్, ఏటూరునాగారం ఇరుసవడ్ల వెంకన్న, కన్నాయిగూడెం గుడ్ల దేవేందర్, ఎండీ ఆయూబ్‌ఖాన్, మంగపేట గుమ్మడి సోమన్న, కొత్తగూడ చల్ల నారాయణరెడ్డి, గంగారం సుంకరబోయిన మొగిలిలను ప్రకటించారు. త్వరలో పార్టీకోసం కష్టపడి పనిచేసేవారిని గుర్తించి మండల కమిటీలు నియమిస్తామని చెప్పారు. ఈ సమావేశంలో ఎండీ చాంద్‌పాషా, నూనేటి శ్యాం, బండి శ్రీనివాస్, ఆకుతోట చంద్రమౌళి, మట్టెవాడ తిరుపతి, నల్లెల భరత్‌కుమార్, జక్కుల రేవంత్‌యాదవ్, కమ్మరి శంకరయ్య, ఎంపీటీసీ సభ్యుడు మావురపు తిరుపతిరెడ్డి, గండి కుమార్, రత్నం భద్రయ్య, చక్రపు రాజు, అజ్జు, గుండా తిరుపతి పాల్గొన్నారు.

108 వాహనంలో ప్రసవం



ఏటూరునాగారం: కన్నాయిగూడెం మండలం బుట్టాయిగూడెం గ్రామానికి చెందిన పొడెం పోషమ్మ శుక్రవారం 108 వాహనంలో ప్రసవం జరిగింది. వివరాలు ఇలా ఉన్నాయి.. పోషమ్మకు పురిటినొప్పులు రావడంతో 108కు సమాచారం అందించారు. దీంతో వాహనం అక్కడికి చెరుకుని గర్భిణిని తరలిస్తుండగా మార్గమధ్యలోనే నొప్పులు ఎక్కువ కావడంతో 108 ఈఎంటీ శివలింగం ప్రసాద్, పైలట్ సతీష్, ఆశ వర్కర్ శ్రీలత కలిసి సుఖ ప్రసవం చేశారు. తల్లిబిడ్డ క్షేమంగా ఉంది. సామాజిక ఆస్పత్రికి మెరుగైన చికిత్సల కోసం తరలించారు. సిబ్బందికి కుటుంబ సభ్యులు అభినందనలు తెలిపారు.

కళాశాలలు ఏర్పాటు చేయాలని వినతి



వెంకటాపురం(కె): మండలంలో ప్రభుత్వ జూనియర్, డిగ్రీ కళాశాలలను ఏర్పాటు చేయాలని కోరుతూ వెంకటాపురం నివాసీ, హైకోర్టు లాయర్ పిట్టా శ్రీనివాసరెడ్డి శుక్రవారం హైదారాబాద్‌లో కేంద్ర మంత్రి కిషన్ రెడ్డిని ఆయన నివాసంలో కలిసి వినతిపత్రం అందజేశారు. మండలంలో ఫైర్ స్టేషన్ లేక ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని అగ్ని ప్రమాదాలు చోటు చేసుకుంటే అందుబాటులో అగ్నిమాపక కేంద్రం లేక ఇల్లు కాలి బూడిదై పోతున్నాయని మంత్రి దృష్టికి తీసుకువెళ్లారు.

వాహనాల తనిఖీ

వెంకటాపురం(కె): మండల పరిధిలోని విజయపూరి కాలనీ సమీపంలోని కొత్తపల్లికి వెళ్లే రహదారి సమీపంలో ఎస్సై తిరుపతి రావు ఆధ్వర్యంలో వాహనాల తనిఖీ నిర్వహించారు. ఈ సందర్భంగా రహదారిపై వచ్చి వెళ్లే వాహనాలను పరిశీలించి అనుమానిత వ్యక్తులు ఎవరైన తారసపడితే వారి వద్ద నుంచి పూర్తిస్థాయి సమాచారాన్ని సేకరించి వదిలేశారు.

క్షమాగుణం కలిగి ఉండాలి

మంగపేట: క్రీస్తు బోధించిన విధంగా ప్రతి ఒక్కరూ క్షమాగుణం కలిగి ఉండాలని తోటి వారిపై ప్రేమ, దయా గుణంతో జీవించాలని చర్చి పాస్టర్లు అన్నారు. మండలంలోని కమలాపురం, మంగపేటతో గుడ్‌ఫ్రైడే వేడుకలను క్రైస్తవ సోదరులు శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగా పలువురు పాస్టర్లు సందేశమిచ్చారు. మానవాలి పాపవిమోచనం కోసం యేసుక్రీస్తు సిలువలో ప్రాణార్పన చేశారని ఆయన త్యాగానికి సంబంధించిన బైబిల్ వ్యాఖ్యలను ఉద్బోదించారుఖీ కార్యక్రమంలో పాస్టర్లు ఆదాం, విజయరాజు, దేవరాజు ఉన్నారు.

ములుగు: జిల్లాకేంద్రంలోని సెయింట్ పీటర్స్ పాల్ చర్చ్‌లో గుడ్‌ఫ్రైడే వేడుకలను క్రైస్తవ సోదరులు శుక్రవారం ఘనంగా జరుపుకున్నారు. లీటర్ ఫ్లవర్ స్కూల్‌లో రేవరెన్ ఫాదర్ మహిపాల్ ఆధ్వర్యంలో ప్రార్థనలు నిర్వహించారు. ఏసు క్రీస్తు శిలువ వేయబడ్డ రోజును గుర్తు చేసుకున్నారు. ఈ కార్యక్రమంలో రామచంద్రాపురం, మదనపల్లి చర్చిల విశ్వాసులు పాల్గొన్నారు.

వెంకటాపురం(కె): మండలంలో గుడ్ ఫ్రైడే వేడుకలను శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగా మండల పరిధిలోని భోదాపురం జీటీ ఎస్ఎస్ఎస్ చర్చిలో మండల కేంద్రంలోని సెంటనరీ మెతడిస్టు చర్చిలో ప్రత్యేక ప్రార్థనలు చేశారు. గ్రామాల్లోని పలు వీధుల్లో పాటులు పాడుతూ ర్యాలీ నిర్వహించారు. అనంతరం చర్చిలో పాస్టర్ లూకా, విజయ్ చదర్ క్రీస్తు బోధనలను వివరించారు.

ఏటూరునాగారం: మండల కేంద్రంలోని సీఎస్ఐ మిషన్ స్కూల్ ఆధ్వర్యంలో గుడ్‌ఫ్రైడే వేడుకలను శుక్రవారం క్రైస్తవులు నిర్వహించారు. ఫాస్టర్ బిజ్జు సిలువను ధరించి క్రైస్తవులతో కలిసి గ్రామ పుర వీధుల్లో ఉత్సవాన్ని జరిపించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఏసు ప్రభు మంచి విషయాలను బోధించడంతో అందరికి మంచి అలవాటు అయ్యిందన్నారు. అనంతరం చర్చిలో ప్రత్యేక ప్రార్థనలు చేశారు. ఈ కార్యక్రమంలో ముత్తయ్య, నర్సింహరావు, విజయ్, హేమంత్, ఇసాక్ పాల్గొన్నారు.

వెంకటాపురం(ఎం): మండల కేంద్రంలోని కర్మెల్ బాప్టిస్ట్ చర్చిలో పాస్టర్ రాజేందర్ ఆధ్వర్యంలో గుడ్ ఫ్రైడే వేడుకలను నిర్వహించారు. ఈ సందర్భంగా పాస్టర్ మాట్లాడుతూ.. లోకంలో ఉన్న ప్రజలందరూ సుఖసంతోషాలతో ఉండేందుకు కోసం ప్రార్థనలు చేస్తున్నామని పేర్కొన్నారు. ప్రతి కుటుంబంలో శాంతి కలిగి ఉండాలనేదే ఏసు సిలువ సందేశం అని తెలిపారు.



కమలాపురంలో శిలువ యాత్ర నిర్వహిస్తున్న క్రైస్తవులు



ములుగు: శాంతిర్యాలీ నిర్వహిస్తున్న క్రైస్తవులు



వెంకటాపురం(ఎం): మాట్లాడుతున్న రాజేందర్



మంగపేట: ఏసుక్రీస్తు శిలువను మోస్తున్న ఆర్ఎంసీ హైస్కూల్ బృందం

సేంద్రియ వ్యవసాయంపై ఉచిత శిక్షణ

మంగపేట: మండలంలోని మల్లూరు శ్రీ హేమాచల లక్ష్మీనర్సింహస్వామి ఆలయ ప్రాంగణంలో ఆదిగురువు భారత సంఘం ఆధ్వర్యంలో రైతులకు సేంద్రియ వ్యవసాయంపై శుక్రవారం ఒక్కరోజు శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆ సంఘం వ్యవస్థాపక అధ్యక్షుడు గోపిమాధవ్ రైతులను మాట్లాడుతూ.. ప్రస్తుత కాలంలో పంట భూములు(ఫర్టిలైజర్స్) రసాయనాలకు అలవాటు పడి ఉన్నాయన్నారు. రైతులు అధిక దిగుబడికోసం పోటీ పడి రసాయనాలతో పంట పండించడం వలన ప్రజలకు అనారోగ్య సమస్యలు వస్తున్నాయన్నారు. గతంలో రైతులు సాంప్రదాయ పంటలను పండించే వారన్నారు. సనాతన ధర్మం నిత్య నూతనం కాబట్టి ప్రస్తుతం వ్యవసాయం చేసే యువ రైతులందరు పూర్వకాలం పంటలను ఎంచుకోవాలన్నారు. రైతులు చిరుధాన్యాలు, ప్రకృతి ఆధారిత పంటలను వారి వారి ఇంటివరకైనా పండించుకుని అనారోగ్యం పాలు కాకుండా అందరికి మార్గదర్శకం కావాలన్నారు. ఈ కార్యక్రమంలో ఆ సంఘం జిల్లా కన్వీనర్ ఎల్లంకి రాజేశ్వర్‌రావు, శ్రీకాంత్, రాంరెడ్డి, నాగభూషణం, కృష్ణమూర్తి, ఆదినారాయణ, నాగేశ్వర్‌రావు, నారాయణ తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న గోపిమాధవ్

సీఎంఆర్‌ఎఫ్ చెక్కుల పంపిణీ

మంగపేట: మండల కేంద్రంలోని కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో వివిధ గ్రామాలకు చెందిన లబ్ధిదారులకు సీఎం రిలీఫ్ ఫండ్‌చెక్కులను ఆ పార్టీ అనుబంధ ఎస్టీసెల్ జిల్లా అధ్యక్షుడు గుమ్మడి సోమయ్య శుక్రవారం పంపిణీ చేశారు. ఈ సందర్భంగా సోమయ్య మాట్లాడుతూ.. ప్రవేట్ ఆస్పత్రుల్లో వైద్యం పొందిన ఏడుగురికి ఎమ్మెల్యే సీతక్క చొరవతో మంజూరైన చెక్కులను లబ్ధిదారులకు అందజేసినట్లు తెలిపారు. రాజుపేటకు చెందిన కర్రి పున్నమ్మకు రూ.60,000, బోరునర్సాపురం గుండారపు పుష్పకు రూ.9,000, ఇర్సవడ్ల రజితకు రూ.24,000, రమణక్కపేటకు చెందిన తోకల రవీందర్‌కు రూ.13,500, నర్సింహాసాగర్‌కు చెందిన ఎంపెల్లి రవీందర్‌కు రూ.10,500, మంగపేటకు చెందిన అచ్చిరెడ్డికి రూ.12,000, కమలాపురానికి చెందిన శివయ్యకు రూ.12,000ల విలువ గల చెక్కును అందజేసినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ బీసీసెల్ జిల్లా ప్రధాన కార్యదర్శి పెద్ది నర్సింహారావు, వర్కింగ్ కమిటీ మండల అధ్యక్షుడు కిషోర్, వెంకటేశ్వర్లు, కిసాన్‌సెల్ మండల అధ్యక్షుడు చౌళం వెంకటేశ్వర్లు, మండల నాయకులు భగవాన్‌రెడ్డి, యానయ్య, నర్సయ్యగౌడ్ పాల్గొన్నారు.

నేడు సరఫరా నిలిపివేత

ములుగు రూరల్: విద్యుత్ సబ్ స్టేషన్ మరమ్మతుల కారణంగా నేడు (శనివారం) పట్టణంలో ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు ఏఈ సాయిక్రిష్ణ శుక్రవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. వినియోగదారులు సహకరించాలని కోరారు.

గ్రామాల అభివృద్ధే ప్రభుత్వ ధ్యేయం



రోడ్డు పనులు ప్రారంభిస్తున్న నాగజ్యోతి

ఎస్ఎస్‌తాడ్వాయి: గ్రామాల అభివృద్ధే ప్రభుత్వ ధ్యేయమని జెడ్పీ వైస్ చైర్‌పర్సన్ బడే నాగజ్యోతి అన్నారు. శుక్రవారం మండలంలోని మేడారంలో సీసీ రోడ్డు నిర్మాణ పనులను ఆమె ప్రారంభించి మాట్లాడారు. గ్రామాల్లో అంతర్గత రోడ్ల నిర్మాణానికి సీసీ రోడ్లను మంజూరు చేసిందన్నారు. రాష్ట్ర ప్రభుత్వంతోనే గ్రామాల అభివృద్ధి సాధ్యమవుతుందన్నారు. ఈ కార్యక్రమంలో స్థానిక సర్పంచ్ చిడం బాబురావు, తాడ్వాయి మండల అధ్యక్షులు దండుగుల మల్లయ్య మండల యూత్ అధ్యక్షుడు కోట సురేష్, మండల బీసీ సెల్ అధ్యక్షుడు ఆలకుంట కృష్ణ, సీనియర్ నాయకులు బ్రహ్మచారి, పూర్ణచందర్ పాల్గొన్నారు.

విద్యుత్ స్తంభాల ఏర్పాటు

వాజేడు: మండల కేంద్రంలో గురువారం సాయంత్రం వీచిన గాలికి దంతులూరి సుందర నర్సింహరాజు, ప్రభుత్వ జూనియర్ కళాశాల ఆవరణలో నాలుగు విద్యుత్ స్తంభాలు విరిగిపోయాయి. కాగా శుక్రవారం ఉదయం నుంచి ఏఈ అర్షద్ అహ్మద్ ఆధ్వర్యంలో సిబ్బంది మరమ్మతు పనులను చేపట్టారు. లైనుపై తెగి పడిన చెట్టును తొలగించి కొత్త స్తంభాలను ఏర్పాటు చేశారు. అనంతరం తెగి పడిన విద్యుత్ వైర్ల స్థానంలో కొత్త వైర్లను ఏర్పాటు చేశారు. సాయంత్రం 5 గంటలకు పనులు పూర్తి చేసి విద్యుత్ సరఫరాను పునరుద్ధరించారు. స్తంభాలు విరిగిన కారణంగా మండల కేంద్రంలో గురువారం సాయంత్రం నుంచి శుక్రవారం సాయంత్రం వరకు విద్యుత్ నిలిచిపోయింది.



వైర్లను ఏర్పాటు చేస్తున్న విద్యుత్ శాఖ సిబ్బంది

బహిరంగ సభను జయప్రదం చేయండి

వెంకటాపురం(ఎం): తెలంగాణ రాష్ట్రంలో అభివృద్ధి పనులు ప్రారంభించేందుకు నేడు(శనివారం) హైదరాబాద్‌కు వస్తున్న ప్రధాని నరేంద్రమోడికి ఘన స్వాగతం పలికేందుకు బీజేపీ శ్రేణులు తరలివచ్చి బహిరంగ సభను విజయవంతం చేయాలని ఆ పార్టీ మండల అధ్యక్షుడు భుక్యా జవహర్‌లాల్ పిలుపునిచ్చారు. శుక్రవారం మండలంలోని లక్ష్మీదేవిపేట గ్రామంలో ఆయన విలేకరుల సమావేశం ఏర్పాటు చేసి మాట్లాడారు. ప్రపంచ దేశాలకు ఆదర్శనీయ పాలనతో భారతదేశాన్ని అగ్రగామిగా నిలుపుతున్న ప్రధాని నరేంద్ర మోదీ రాష్ట్రానికి వస్తున్న సందర్భంలో ప్రతి ఒక్కరూ స్వాగతం పలికేందుకు సిద్ధం కావాలని కోరారు. రాష్ట్రంలో అవినీతి పాలనతో కేసీఆర్ కుటుంబం బురదలో పడిందని దానిని పక్కవారిపై కూడా చల్లేందుకు ప్రయత్నిస్తున్నారని ఆరోపించారు. ఇప్పటికే ఉద్యోగులు, నిరుద్యోగులు, రైతులు, ప్రజలు కేసీఆర్ పాలనపై ఆగ్రహంతో ఉన్నారని అన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు కారు పోతుల దేవేందర్ గౌడ్, ధరం సింగ్, సుమన్ రావు, సంతోష్, రెడ్డి సతీష్, కుమార్, నీలయ్య, నాగయ్య, రూప్సింగ్, రమేష్, శ్రీధర్ తదితరులు ఉన్నారు.



మాట్లాడుతున్న జవహర్‌లాల్

ఆరోగ్యంపై శ్రద్ధ అవసరం



ఏటూరునాగారం: ర్యాలీ నిర్వహిస్తున్న వైద్యులు, సిబ్బంది



వాజేడులో..

ములుగు: ప్రతి ఒక్కరూ ఆరోగ్యంపై శ్రద్ధ కలిగి ఉండాల్సిన అవసరం ఉందని డీఎంహెచ్ఓ అల్లెం అప్పయ్య అన్నారు. ప్రపంచ ఆరోగ్య దినోత్సవం సందర్భంగా వైద్యశాఖ ఆధ్వర్యంలో జిల్లాకేంద్రంలో నిర్వహించిన ఆరోగ్య అవగాహన ర్యాలీని ఆయన జెండాఊపి ప్రారంభించారు. ఈ సందర్భంగా అప్పయ్య మాట్లాడుతూ శుభ్రమైన భోజనాన్ని తీసుకోవడంతో పాటు చుట్టుపక్కల పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని అన్నారు. ఆరోగ్యాన్ని ఆస్తిలా భావించాలని చెప్పారు. పుట్టినప్పటి నుంచి సకాలంలో చిన్నారులకు టీకాలు ఇప్పించాలని అన్నారు. టీకాలతో రోగనిరోధకశక్తి పెరిగి జబ్బుల బారిన పడకుండా ఉంటారని తెలిపారు. ప్రభుత్వ ఆస్పత్రులను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. వైద్య సిబ్బంది ప్రతి శుక్రవారం డ్రైడే ఫ్రైడే తప్పకుండా నిర్వహించాలని అన్నారు. ప్రోగ్రాం అధికారి డాక్టర్ పోరిక రవీందర్ మాట్లాడుతూ రెండు వారాలకు పైగా దగ్గు ఉంటే తెమడ పరీక్ష చేయించుకోవాలన్నారు. క్షయ వ్యాధినిర్ధారణ అయితే ప్రభుత్వం తరపున ఉచితంగా మందులు, చికిత్స అందిస్తామని అన్నారు. ఈ కార్యక్రమంలో మాస్ మీడియా అధికారి తిరుపతయ్య, సీహెచ్ఓ జినుకల దుర్గారావు, సంపత్‌రావు, రాయినిగూడెం వైద్య సిబ్బంది, ఆశ కార్యకర్తలు పాల్గొన్నారు.



ములుగు: జెండా ఊపి ర్యాలీని ప్రారంభిస్తున్న డీఎంహెచ్ఓ అల్లెం అప్పయ్య

ఏటూరునాగారం: ప్రతి ఒక్కరూ వ్యక్తిగత శుభ్రతను పాటించాలని ఎన్‌సీడీ జిల్లా ప్రోగ్రాం ఆఫీసర్, డాక్టర్ మంకిడి వెంకటేశ్వర్లు అన్నారు. ప్రపంచ ఆరోగ్య దినోత్సవం సందర్భంగా శుక్రవారం మండల కేంద్రంలోని రొయ్యూర్ పీహెచ్‌సీ పరిధిలో సబ్‌సెంటర్ వద్ద ర్యాలీ నిర్వహించారు. అనంతరం మండల కేంద్రంలోని కేజీబీవీ పాఠశాలలో వ్యాసరచన పోటీలను నిర్వహించి గెలుపొందిన విద్యార్థులకు బహుమతులను అందజేశారు.ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో వెంకటేశ్వర్లు మాట్లాడుతూ.. ఆహారం తీసుకునే ముందు చేతులను శుభ్రం చేసుకోవాలన్నారు. జలుబు, దగ్గు వస్తే దస్తీ అడ్డుపెట్టుకోవాలన్నారు. జ్వరం, ఇతర అనారోగ్య సమస్యలు వస్తే వైద్యులను సంప్రదించాలని కోరారు. ప్రతి రోజు వ్యాయామం, యోగ చేయాలని, వాకింగ్ చేయడం వల్ల అనేక లాభాలున్నాయన్నారు. ఒత్తిడికి గురికాకుండా ధ్యానం చేయాలని తెలిపారు. పిల్లల రుగ్మతులను తల్లిదండ్రులు ఎప్పటికప్పుడు పరిశీలిస్తూ తగు చర్యలు తీసుకోవాలన్నారు. చదువుకునే సమయంలో సరైన నిద్ర, పోషణాహారం తీసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో వైద్యులు చంద్రశేఖర్, చాముండేశ్వరి, సుచిరిత, మౌనిక, అనూష, సీహెచ్ఓ శారద, ఏఎన్ఎంలు, ఆశ కార్యకర్తలు, కేజీబీవీ ఎస్ఓ పీవై లక్ష్మి, ఉపాధ్యాయులు, స్వచ్ఛంద సంస్థ ప్రతినిధి శఫీ పాల్గొన్నారు.

వాజేడు: ప్రపంచ ఆరోగ్య దినోత్సవం సందర్భంగా శుక్రవారం మండల కేంద్రంలో వైద్యాధికారి కొమరం మహేందర్ ఆధ్వర్యంలో వైద్య సిబ్బంది ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. వ్యాధులు రాకుండా ప్రతీ ఒక్కరు జాగ్రత్తలను తీసుకోవాలని, ఏ విధమైన నలతకు గురైనా ప్రభుత్వ ఆసుపత్రికే రావాలన్నారు. ప్రతీ ఒక్కరు ఆరోగ్య కరమైన జీవితాన్ని గడపాలని కోరారు. ఈ ర్యాలీలో కోటిరెడ్డి, చిన్న వెంకటేశ్వర్లు, ఏఎన్ఎమ్‌లు, ఆశ వర్కర్లు ఉన్నారు.

పౌష్టికాహారం అందజేత



విద్యార్థులతో దాతలు

ఏటూరునాగారం: మండల కేంద్రంలోని జెడ్పీహెచ్ఎస్ క్రీడా ప్రాంగణంలో ప్రభుత్వ పాఠశాలలకు చెందిన క్రీడాకారులకు వితి ఐటీ కంపెనీ ప్రతినిధులు శుక్రవారం పౌష్టికాహారాన్ని అందజేశారు. ఏటూరునాగారం స్పోర్ట్స్ క్లబ్ కోచ్ పర్వతాల కుమారస్వామి ఆధ్వర్యంలో ట్రైనింగ్ తీసుకుంటున్న విద్యార్థులకు స్పోర్ట్స్ కిట్స్‌లు, 20 కిలోల వేరుశనగలు, 20 కిలోల బెల్లం, అరటిపండ్లతోపాటు టీషర్టులను అందజేశారు.ఖీ కార్యక్రమంలో వితి కంపెనీ ప్రతినిధులు సతీష్, అభినయ్, వెంకటేశ్వర్లు, విద్యార్థులు పాల్గొన్నారు.

రాష్ట్రంలో అవినీతి పాలన

బీజేపీ జిల్లా అధ్యక్షుడు భాస్కర్‌రెడ్డి

ములుగు రూరల్: రాష్ట్రంలో సీఎం కేసీఆర్ అవినీతి పాలన కొనసాగిస్తున్నారని బీజేపీ జిల్లా అధ్యక్షుడు చింతలపూడి భాస్కర్‌రెడ్డి అన్నారు. శుక్రవారం బీజేవైఎం ఆధ్వర్యంలో సామాజిక న్యాయ వారోత్సవాలలో భాగంగా జిల్లాకేంద్రంలోని జెడ్పీ ఉన్నత బాలుర పాఠశాలలో స్వచ్ఛ భారత్ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో అవినీతి, అక్రమాలను ఎత్తిచూపితే జైళ్లకు పంపిస్తున్నారని ఆరోపించారు. తెలంగాణ రాష్ట్రంలో పేపర్ స్కాం, లిక్కర్ స్కాం, కాళేశ్వరం కమిషన్‌లపై ఆధారపడి పాలన నడుస్తుందని అన్నారు. బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు బండి సంజయ్ నిరుద్యోగుల పక్షాన పోరాటం చేస్తుంటే జైలుకు పంపడం కేసీఆర్ నియంత పాలనకు నిదర్శనమని చెప్పారు. ఈ కార్యక్రమంలో జిల్లా ప్రధాన కార్యదర్శి నగరపు రమేష్, మండల అధ్యక్షుడు ఇమ్మడి రాకేష్‌యాదవ్, సిరికొండ బలరాం, కొత్త సురేందర్, మహేందర్, రాకేష్‌రెడ్డి, లక్ష్మణ్, ప్రవీణ్ పాల్గొన్నారు.



స్వచ్ఛ భారత్ కార్యక్రమంలో బీజేపీ నాయకులు

అపరిచిత వ్యక్తులకు ఆశ్రయం ఇవ్వొద్దు

ఏటూరునాగారం: గ్రామాల్లోకి కొత్త వ్యక్తులు, అపరచిత వ్యక్తులు వస్తే ఎలాంటి ఆశ్రయం ఇవ్వొద్దని సీఐ రాజు అన్నారు. శుక్రవారం మండల కేంద్రంలోని నందమూరి నగర్, ఆచార్యనగర్, శాలివాహనుల కాలనీ, 5వ వార్డుల ప్రాంతాల్లో పోలీసులు కార్డన్‌సెర్చ్ నిర్వహించారు. ఇంటింటా సోదాలు చేస్తూ అనుమానిత వివరాలను నమోదు చేసుకున్నారు. ఎస్సై రమేష్, సివిల్, సీఆర్‌పీఎఫ్ సిబ్బందితో కలిసి వార్డుల్లోని ఇళ్లను జల్లెడ పట్టారు. గ్రామాల్లోకి వచ్చే కొత్త వ్యక్తులపై పూర్తిగా దృష్టి పెట్టాలని, ఇంటికి అద్దెకు ఇచ్చే ఇంటి యజమానులు పూర్తి సమాచారం, ఆధార్ కార్డులను తీసుకున్న తర్వాతనే అద్దెకు ఇవ్వాలని సీఐ ప్రజలను కోరారు. ఏదైనా అనుమానం వస్తే వెంటనే సమాచారం ఇవ్వాలన్నారు.

వాజేడు: కొత్త వ్యక్తులకు ప్రజలు ఆశ్రయం ఇవ్వవద్దని ఎస్సై రేఖ అశోక్ అన్నారు. మండల పరిధిలోని లక్ష్మీపురం, ఆర్లగూడెం గ్రామాల్లో శుక్రవారం సివిల్, సీఆర్‌పీఎఫ్ పోలీసులతో కలిసి కమ్యూనిటీ కాంటాక్ట్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్సై అశోక్ మాట్లాడుతూ.. గ్రామాల్లో ఏ సమస్య ఉన్న పోలీసులకు నేరుగా వచ్చి చెప్పుకోవచ్చని తెలిపారు. మావోయిస్టులకు సహకరించవద్దని హెచ్చరించారు.



వాజేడు: కమ్యూనిటీ కాంటాక్ట్ ప్రోగ్రాంలో ఎస్సై అశోక్



ఏటూరునాగారం: గ్రామస్తులతో మాట్లాడుతున్న సీఐ రాజు



కార్డన్ సెర్చ్ చేస్తున్న ఎస్సై రమేష్, సిబ్బంది

నేటినుంచి బీరమయ్య జాతర

వాజేడు: తెలంగాణ, ఛత్తీస్‌గఢ్ సరిహద్దు ప్రాంతమైన లొట్టిపిట్టగండి వద్ద నేటి (శనివారం) నుంచి సోమవారం వరకు బీరమయ్య(భీష్మశంఖరుడు) జాతర నిర్వహించనున్నట్లు ఆలయ కమిటీ సభ్యులు శుక్రవారం తెలిపారు. భక్తులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా ఏర్పాట్లను చేస్తున్నట్లు తెలిపారు. మండల పరిధిలోని టేకులగూడెం, పెదగంగారం, కృష్ణాపురం, కడేకల్ గ్రామాలకు చెందిన గిరిజనులు తమ సంప్రదాయం ప్రకారం ఈ జాతర తంతును ప్రారంభిస్తారు. శనివారం ఉదయం నుంచి సమీప గ్రామాలకు చెందిన ప్రజలు తమ దేవుళ్లను ఊరేగింపుగా జాతర ప్రాంతానికి తీసుకెళ్తారు. రాత్రి 8 గంటలకు గిరిజనులు వారి వారి ఆచారాల ప్రకారం నృత్యాలను చేస్తారు. ఆదివారం ఉదయం 4 గంటల ప్రాంతంలో గంగ స్నానాలను ఆచరించి బీరమయ్యను ప్రతిష్ఠిస్తారు. అనంతరం భక్తులు మొక్కులు చెల్లించుంటారు. సోమవారం ఎవరి ఇళ్లకు వారు బయలు దేరి వెళ్లారు. దీంతో జాతర తంతు ముగుస్తుంది.